క్లుప్తంగా

ఆత్మకూరు ఎంపీడీఓగా నాగేంద్రుడు



ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నూతన ఎంపీడీఓగా నాగేంద్రుడు బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో ఈవోపీఆర్డీ విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా ఆత్మకూరుకు వచ్చానని చెప్పారు.

అలరించిన పౌరాణిక నాటకం

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన కె.సుధాకరరావు, బృందం పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

భగత్ సింగ్ జయంతి

బండి ఆత్మకూరు : భారత స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవకారుడు భగత్ సింగ్ 118వ జయంతిని మండల కేంద్రంలోగా నిర్వహించారు. శనివారం మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, రహమాన్, కుల్లాయిస్వామి, నాగరత్నయ్య పాల్గొన్నారు.

మహానందిలో రుద్ర, చండీ హోమాలు

మహానంది: దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా క్షేత్రంలో రుద్ర, చండీహోమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ వేదపండితులు, ప్రధాన , ఉపప్రధాన, ముఖ్య అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక శతచండీ యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, రుత్వికులు రుద్ర, చండీ హోమాలను శనివారం వైభవంగా జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉభయదాతలుగా హోమాల్లో పాల్గొన్నారు. మూలమూర్తి శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం ఉదయం శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుష్మ

వెలుగోడు : 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' మహిళల పాలిట ఆరోగ్య సంజీవిని అని, వైద్య శిబిరాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలని డీడీఓ డాక్టర్ అమూల్య అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహిళలకువైద్య పరీక్షలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు చేసి వైద్య చికిత్సలు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ గర్భిణులకు ఆరోగ్య సేవలు అందించారు. అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార స్టాళ్లు ఏర్పాటు చేశారు. జిల్లా అధికారులు డాక్టర్ కిరణ్, ప్రదీప్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. డాక్టర్లు సుశీల్, వేణుగోపాలకృష్ణుడు, సులోచన, రాఘవరెడ్డి, శరత్, ముదాసిర్, చంద్రశేఖర్‌రెడ్డి, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

మూర్వకొండ ఘాట్‌ను సందర్శించిన సీఐ

పగిద్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ సమీపంలోని మూర్వకొండ ఘాట్‌ను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం శనివారం సందర్శించారు. నదిలోకి మత్స్యకారులు చేపల వేట వెళ్లరాదని హెచ్చరించారు. నది పరివాహక గ్రామాలైన నెహ్రూనగర్, ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, తూర్పు ప్రాతకోట, ఎస్.ఎం. ఘణపురం , రైతుపల్లె, పీకే ప్రాగటూరుగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజిన్ బోటు ప్రయాణంపై నిషేధం ఉన్నందున ఘాట్ నిర్వాహకులు బోట్లు నడుపరాదని హెచ్చరించారు.

అనుమతిలేకుండా డ్రోన్‌తో చిత్రీకరణ



స్వాధీనం చేసుకున్న డ్రోన్ కెమెరా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో అనుమతి లేకుండా ఆలయ పరిసరాలను డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న వారిని దేవస్థాన సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. శనివారం నెల్లూరుకు చెందిన పవన్, శంకర్ అనే యువకులు ఆర్టీసీ బస్సులో శ్రీశైలం చేరుకున్నారు. అనంతరం డ్రోన్‌తో శ్రీశైల ఆలయ పరిసర ప్రాంతాలను చిత్రీకరిస్తుండగా దేవస్థాన సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమైంది. ఎక్కడి నుంచి డ్రోన్ ఆపరేట్ చేస్తున్నారో పరిశీలించి పట్టుకున్నారు. వారిని విచారించగా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని చిత్రీకరించామని చెప్పినట్లు సమాచారం. అంతేకాకుండా వింత సమాధానాలు చెబుతుండడంతో దేవస్థాన సీఎస్‌వో శ్రీనివాసరావు వారిని శ్రీశైలం పోలీసులకు అప్పగించారు. అయితే ఈ నెల 9న శ్రీశైల గర్భాలయంపై డ్రోన్‌తో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ పరిసరాలను చిత్రీకరించారు. ఈ ఘటనపై శ్రీశైలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ కేసుకు, ప్రస్తుతం డ్రోన్‌తో దొరికిన వారికి సంబంధాలు ఉన్నట్లు తెలిసింది.



కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై సిద్ధాపురం అలుగు నుంచి భారీగా పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

వర్షం..బీభత్సం!

- మహానందిలో జిల్లాలోనే అత్యధికంగా 87.2 మి.మీ వర్షపాతం
- ఆత్మకూరులో 76.03 మి.మీ. వర్షపాతం నమోదు
- తిమ్మాపురంలో ఇంటిపై పడిన భారీ వృక్షం
- పాలేరువాగు, రాళ్లవాగు వద్ద రాకపోకలకు అంతరాయం
- నీటమునిగిన పంట పొలాలు
- గరిష్ట స్థాయికి వరదరాజస్వామి ప్రాజెక్ట్ నీటిమట్టం
- సిద్ధాపురం చెరువు అలుగు ప్రవహించడంతో నిలిచిన వాహనాలు

ఆత్మకూరు: వాయుగండ ప్రభావంతో ఆత్మకూరు డివిజన్ పరిధిలో శనివారం భారీ వర్షాలు కురిశాయి. ఆత్మకూరు మండలంలో 76.03 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షాలకు పంట పొలాల్లో వర్షపునీరు పొంగి ప్రవహిస్తోంది. వరదరాజస్వామి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరడంతో గేట్లు ఎత్తి 1,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. సిద్ధాపురం చెరువు అలుగు ప్రవహించడంతో శ్రీశైలం, విజయవాడ, మార్కాపురం, ఒంగోలు, విశాఖపట్నం వైపు వెళ్లే అన్ని వాహనాలను నిలిపివేశారు. ఆత్మకూరు బస్టాండు ప్రాంగణం శ్రీశైలం వెళ్లే బస్సులతో నిండిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఆత్మకూరు నుంచి నంద్యాల, గిద్దలూరు మీదుగా శ్రీశైలం వెళ్లారు. ఉదయం 11 గంటల నుంచి ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, మడకశిర, కర్నూలు డిపోలకు చెందిన పలు బస్సులు శ్రీశైలం వెళ్లకుండానే ఆత్మకూరు నుంచి వెనుదిరిగాయి. వర్షం కారణంగా మొక్కజొన్న, పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతోపాటు భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించడంతో కురుకుంద, కొట్టాల చెరువు, వడ్లరామాపురం గ్రామాల నుంచి ఆత్మకూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భవనాశి, సుద్దవాగు, రాళ్ల వాగు పొంగి ప్రవహించడంతో కొత్తపల్లి మండలం లోని 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



నిండుగా ప్రవహిస్తున్న రాళ్లవాగు



బస్సులు నిలిచిన పోవడంతో ఆత్మకూరు బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు



బుక్కాపురం వద్ద రోడ్డుపై భారీగా చేరిన వర్షపునీరు



అతికష్టం మీద రోడ్డు దాటుతున్న ప్రయాణికులు



తిమ్మాపురంలో ఇంటిపై కూలిన వృక్షం

మహానంది: మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా మహానంది మండలంలో 87.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో పాలేరువాగు ఉప్పొంగింది. దీంతో పాటు మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలోని బుక్కాపురం వద్ద ఉన్న తమ్మడపల్లె ఇంజవాణి చెరువు అలుగు పారడంతో రోడ్డుపై నాలుగు అడుగుల మేర నీరు పారడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తిమ్మాపురం జెడ్పీ పాఠశాల ఆవరణలోని 9వ తరగతి క్లాస్‌రూము వద్ద భారీ వృక్షం వేర్లతో సహా విరిగిపడింది.అలాగే..తిమ్మాపురంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న నాగదేవి, బుక్కా వెంగమ్మల ఇంటిపై భారీ వృక్షం విరిగిపడింది. ఇంట్లో పిల్లలతో నిద్రిస్తున్న వారు శబ్దం రావడంతో ప్రాణభయంతో బయటికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. అబ్బీపురంలోని గిరిజన కాలనీలో నీళ్లు చేరడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. సీపీఐ జిల్లా నాయకులు బాబాఫక్రుద్దీన్, మండల కార్యదర్శి సామేలు, దస్తగిరి, చల్లా శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని గిరిజనులకు మధ్యాహ్నం ఆహార పదార్థాలను అందించారు. అల్లినగరం, శ్రీనగరం, తదితర గ్రామాల పరిధిలో పసుపు, అరటితోటల్లో భారీగా వర్షపునీరు నిలవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి పాలేరువాగు, ఇంజవాణి చెరువు అలుగుల వద్ద ప్రయాణికులు, స్థానికులకు అవగాహన కల్పించి పోలీసు కానిస్టేబుళ్లను కాపాలాగా ఉంచారు.



మహానంది: అరటి పంటలో నిలిచిన వర్షపు నీరు

వెలుగోడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 77.6 మి.మీ. వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు

కొత్తపల్లి: వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున ఎవరూ వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని ఎం .లింగాపురం శివపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు ఉధృతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు ఎద్దులేరు వాగు ఉధృతి ఎక్కువగా ఉందని బైకులపైగాని, ఆటోలలోగాని, నడుచుకుంటూగాని వాగులు దాటే ప్రయత్నం చేసి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ రామ్‌నాయక్, కానిస్టేబుల్లు అశ్వక్, షేక్షావలి, తదితరులు ఉన్నారు.



ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న ఆత్మకూరు సీఐ



తిమ్మాపురం జెడ్పీ పాఠశాల వద్ద కూలిన వృక్షం



అబ్బీపురం చెంచుకాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

వీడని వాన



నందికుంట వద్ద పత్తిపొలంలో వర్షపునీరు

కొత్తపల్లి: రెండు రోజుల నుంచి మండలంలో వర్షం వీడకుండా పడుతోంది. మండలంలో 10.8 మి.మీల వర్షపాతం నమోదు అయింది. మొక్కజొన్న, వరి, పత్తి పంటల్లో వర్షపు నీరు నిలిచింది. నందికుంట వద్ద ఎక్కువగా రోడ్డుపై నీరు నిలవడం, ఆత్మకూరు సమీపంలో భవనాశి నది ఉప్పొంగి ప్రవహించడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుద్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో వర్షపు నీరు చేరింది. దుద్యాల సమీపంలో భవనాశి వాగు ఉప్పొంగి ప్రవహిస్తూ మొక్కజొన్న, మామిడి తోటల్లోకి వర్షపునీరు చేరింది.



దుద్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

కాలనీవాసుల మధ్య వాగ్వాదం

గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీకాలనీ మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. డ్రైనేజీ వ్యవస్థలేక పోవడంతో ఇళ్లు, రోడ్లపై నీరు నిలిచింది. దీంతో కొంత మంది కాలనీ వాసులు వారి ఇళ్లముందు నీరు తొలగించేందుకు ప్రయత్నించగా కాలనీ వాసులమధ్య వాగ్వాదం జరిగింది. ఇప్పటికైన అధికారులు చొరవచూపి నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

44.6 మీ.మీ. వర్షపాతం నమోదు

పగిద్యాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రెండవ రోజైన శనివారం మండలంలో 44.6 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు వెల్లడించారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి 4 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద నీరు విడుదల చేసినందున నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దెబ్బతిన్న, మట్టిమిద్దెల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని గ్రామాల్లో దండోరా వేయించాలని తహసీల్దార్ వీఆర్వోలకు ఆదేశించారు.



గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలో వాగ్వాదం

పరిహారం చెల్లించకపోతే ఆందోళన

నందికొట్కూరు: నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రైతు సంఘం అధ్యక్షుడు చిన్న పుల్లారెడ్డి, కార్యదర్శి శెట్టి రవి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పల్లవి సీడ్స్, వెంకటేశ్వర ఏజెన్సీ, మహాగణపతి, రాయలసీమ సీడ్స్ దుకాణాల్లో డికాల్బ్ బీర్ కంపెనీ 9133, జీల్ 135 కంపెనీకి చెందిన విత్తనాలను 100 మంది రైతులు కొని 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో ఖాళీ మొక్కజొన్న కంకులు కనిపించడంతో రైతుల గుండెలు పగిలిపోయినంత పని అయ్యిందని చెప్పారు. చాలా మంది రైతులు మొక్కజొన్న చేనులో పడిపోయిన ఘటనలు ఉన్నాయన్నారు. విత్తనాలు ఇచ్చిన దుకాణాల వద్దకు వెళ్లి అడిగితే ఎలాంటి స్పందన కనిపించకపోవడంతోనే రైతన్నలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నెల 28వ తేదీన ఆదివారం రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోతే రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, రమణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పల్లవీ సీడ్స్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

జూపాడుబంగ్లా: చిన్న సన్న కారు రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేసిన శ్రీ పల్లవి సీడ్స్ షాపు లైసెన్స్ రద్దు చేసి డీలర్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఎం మండల కన్వీనర్ ఎం కర్ణ, సీనియర్ నాయకులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 80 బన్నూరు గ్రామానికి చెందిన రైతులతో కలిసి శనివారం డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌కు వినత పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు యేసు రాజు, దేవదాసు, వెంకటరమణ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌కు 7,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 7,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని ఏఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి 6,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. శనివారం వీబీఆర్‌లో 264.10 మీటర్ల వద్ద 866.468 అడుగులతో 15.858 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.



వీబీఆర్‌లోకి వస్తున్న కృష్ణా జలాలు

ఇళ్ల నిర్మాణానికి అనుమతించండి

ఆత్మకూరు: పెచ్చెరువులో ఉంటున్న చెంచు గిరిజన కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఫారెస్టు అధికారులు అనుమతి ఇవ్వాలని కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఆశీర్వాదం ఫారెస్టు ఉన్నతాధికారులను కోరారు. శనివారం గిరిజనలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చెంచు గిరిజన గూడెంలో నివసిస్తున్న గిరిజనులకు సొంతిల్లు లేక పూరిగుడిసెల్లోనే నివాసముంటున్నారన్నారు. ఇళ్లను నిర్మించుకునేందుకు ఒక డీఎఫ్ అనుమతి ఇస్తే, మరొక డీఎఫ్ నిరాకరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఫారెస్టు అధికారులు స్పందించి వారికి ఇళ్లు నిర్మించి, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు నక్కంటి, టీటీడీపీ ప్రెసిడెంట్ కదుముల చిన్నోడు, చెవుల గుండయ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

నందికొట్కూరు: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో వేసిన మొక్కజొన్న, పత్తి, ఉల్లి, మిరప పంటలు భారీ దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సర్వే చేయించి రైతులకు నష్టం జరగకుండా ఆదుకోవాలని కోరారు. అలాగే మొక్కజొన్న నకిలీ విత్తనాలు రైతులకు సరఫరా చేసిన కంపెనీలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగేశ్వరరావు, గాబ్రియేల్, కుమారి, మేరీ, సావిత్రి, రామకృష్ణ, షేక్షావలి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

పాములపాడు: ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నంద్యాల జిల్లా ఏపీ రైతు సంఘం కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం రెండవ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాను, వరదల వల్ల రైతన్న పూర్తిగా నష్టపోయి అప్పులపాలయ్యారన్నారు. జిల్లాస్థాయిలో పంట నష్టం అంచనావేసి రబీ సీజన్లో విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ఇవ్వాలని, రైతులకు పూర్తిగా రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకుడు రామేశ్వర రావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి సోమన్న తదితరులు పాల్గొన్నారు..

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

వెలుగోడు: పట్టణంలో శ్రీ శివరామ ధ్వజ ప్రతిష్ఠ, లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి శనివారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు చేపట్టారు. పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ, రవి కుమార్ శర్మ,చెన్నకేశవ శర్మ ఆధ్వర్యంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసము, ప్రాణ ప్రతిష్ఠ, బలిదానం, మహా పూర్ణాహుతి జరిపించారు.ఆలయ ధర్మకర్తలు లాలంజయరామయ్య,లాలం సుబ్రహ్మణ్యం,లాలం నరసింహయ్య, లాలం పుల్లయ్య, లాలం విజయకుమార్, లాలం నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి సంజీవ రాయప్రసాద్, వాసవీ సత్రం అధ్యక్షుడు లాలం సుధాకర్, బళ్లాని వెంకట సత్యనారాయణ,లాలం నాగార్జున పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

త్రిమూర్తుల సృష్టే కాత్యాయని దుర్గ !

మహానంది: మహిషాసురుడిని సంహరించేందుకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టించిన దేవినే శ్రీ కాత్యాయని దుర్గ అని మహానంది ఆలయం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి శ్రీ కాత్యాయని దుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ, పూజాదికాలు చేపట్టారు. శ్రీ కాత్యాయని ఆరాధన ద్వారా సకల రోగాలు, భయాలు, శోకాలు తొలగి ధర్మార్థ, కామమోక్షాలను ప్రసాదిస్తుందన్నారు. గజవాహనంపై కొలువైన కాత్యాయని దుర్గను వేలాది భక్తులు దర్శించి తరించారు. ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, అర్చకులు పాల్గొన్నారు.



మహానందిలో శ్రీ కాత్యాయని దుర్గగా కామేశ్వరి దేవి

లలిత త్రిపుర సుందరీ నమో నమః




ఓంకారలో లలిత దేవిగా ఉమామహేశ్వరి



బుక్కాపురంలో లలితా త్రిపుర సుందరిగా దుర్గాదేవి



వెలుగోడులో అన్నపూర్ణగా వాసవీ మాత



ఆత్మకూరులో వేంకటేశ్వరస్వామిగా వాసవీ

సాక్షి నెట్‌వర్క్: దసరా నవరాతిర ఉత్సవాల్లో భాగంగా..శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారు శనివారం శ్రీలలిత త్రిపుర సుందరి దేవి, అన్నపూర్ణ, వేంకటేశ్వర స్వామి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



లలిత త్రిపురసుందరి దేవిగా కొలనుభారతి దేవి



బంగ్లా కట్ట శివాలయంలో..



జూపాడుబంగ్లా క్వాటర్స్‌లో సరస్వతి దేవి



పాములపాడు: చాముండేశ్వరిగా



ఆత్మకూరు: లలితాదేవిగా చౌడేశ్వరిమాత





నందికొట్కూరులో లలిత త్రిపుర సుందరి దేవిగా వాసవీమాత, చౌడేశ్వరీ దేవి



మిడుతూరులో వాసవీ మాత ఆలయంలో..